క్లుప్తంగా

పాఠశాలకు వాటర్ ప్యూరిఫయర్ బహూకరణ



వాటర్ ప్యూరిఫయర్ అందజేస్తున్న బ్యాంక్ ఆఫ్ భరోడా సిబ్బంది

గరిడేపల్లి : మండలంలోని రాయినిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బ్యాంక్ ఆఫ్ భరోడా ఆధ్వర్యంలో శుక్రవారం వాటర్ ప్యూరిఫయర్‌ను బహూకరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కె.కనకయ్య, బ్యాంకు మేనేజర్ శంకర్, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

రక్షణ గోడ పనుల పరిశీలన

నడిగూడెం : మండల పరిధిలోని చాకిరాల వద్ద సాగర్ ఎడమ కాల్వ వంతెన వెంట నిర్మిస్తున్న రక్షణ గోడ నిర్మాణ పనులను శుక్రవారం ఎంపీపీ యాతాకుల జ్యోతి పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని, పనుల్లో నాణ్యత పాటించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

25న కోదాడలో మెగా జాబ్ మేళా



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు శశీధర్‌రెడ్డి, చందర్‌రావు, తదితరులు

కోదాడ : పట్టణంలోని పెరిక భవన్‌లో ఈ నెల 25న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు బీఆర్‌ఎస్ పార్టీ కోదాడ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ శశీధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు చెప్పారు. శుక్రవారం కోదాడలో జాబ్‌మేళాకు సంబంధించిన పోస్టర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఈ జాబ్‌మేళాలో 72 కంపెనీలు పాల్గొననున్నాయని, దాదాపు 9 వేల మందికి ఉద్యోగ అవకాశాలు ఉంటాయని తెలిపారు. రాష్ట్రంలో ఎంతో పేరున్న బహుళజాతి కంపెనీలు ఈ జాబ్‌మేళలో పాల్గొననున్న ట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని కోదాడ ప్రాంత విద్యార్థులు, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ముత్తవరపు పాండురంగారావు, బొలిశెట్టి నాగేంద్రబాబు, కొణతం శ్రీనివాసరెడ్డి, నాగేశ్వరరావు, పిడమర్తి రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సహస్ర కుంకుమార్చన

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో శుక్రవారం భక్తులు సహస్ర కుంకుమార్చనను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రభాత సేవ, ఆరాధన, లక్ష్మీఅమ్మవారికి అభిషేకం, గోదాదేవికి అలంకరణ, సహస్ర కుంకుమార్చన, ఆరగింపు, మంగళాశాసనం, తీర్థప్రసాద వినియో గం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎంపీ లక్ష్మణరావు, అర్చకుడు హరీష్‌కుమార్‌చార్యులు, భక్తులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల హుండీ లెక్కింపు

హుజూర్‌నగర్ : పట్టణ పరిధిలోని శ్రీవేణుగోపాల సీతారామచంద్రస్వామి వారి బ్రహ్మోత్సవాల హుండీ ఆదాయాన్ని శుక్రవారం ఆలయ ప్రాంగణంలో లెక్కించారు. ఈ సందర్భంగా హుండీ లెక్కింపు అధికారి కేవీ చలపతిరావు, ఈఓ గుజ్జుల కొండారెడ్డి మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన నాలుగు హుండీల ద్వారా రూ.75, 236ల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. టెంకాయల అమ్మకానికి వేలం ద్వారా రూ.27 వేలు, తైబజార్ వేలం ద్వారా రూ.28,500 ఆదాయం లభించినట్లు చెప్పారు. కార్యక్రమంలో అభివృద్ధి సమితి సభ్యులు గుండా రమేష్, కోటా సూర్యప్రకాశరావు, పోనుగుపాటి అశోక్, స్థానాచార్యులు జగన్నాథచార్యులు, దామోదరాచార్యులు, వెంకటనరసింహాచార్యులు, అర్చకులు మురళీకృష్ణమాచార్యులు, సిబ్బంది హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

కోదండరామస్వామి ఆలయంలో అన్నదానం

కోదాడఅర్బన్ : పట్టణంలోని శ్రీ కోదండరామ స్వామి ఆలయంలోని బాలాలయంలో స్వామివారికి శుక్రవారం అభిషేకం, పుష్పాలంకరణ, సమాస్రనామార్చన చేశారు. అనంతరం మహానివేదన, తీర్థ ప్రసాద వినియోగం గావించారు. ఈ సందర్భంగా శ్రీవాసవీఆర్యవైశ్య సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు దాతల సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదానాన్ని ఆర్య వైశ్య సంఘం జిల్లా కోశాధికారి తెల్లాకుల వెంకటేశ్వర్లు ప్రారంభించారు. కార్యక్రమంలో సభ్యులు గాధంశెట్టి శ్రీనివాసరావు, పందిరి సత్యనారాయణ, కనమర్లపూడి నర్సింహారావు, ఇరుకుల చెన్నకేశవరావు, సాయి, వెంపటి ప్రసాద్, సాంబశివరావు, వెంకటేశ్వర్లు, రంజిత్, రవి, మణి తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

కోదాడరూరల్ : మండల పరిధిలోని కూచిపూడిలో ఇటీవల మృతి చెందిన మాజీ సర్పంచ్ ఖరీం, ఎర్రవరం ఎంపీటీసీ రాజు కుటుంబాలకు అండగా ఉంటామని ఎంపీపీ చింత కవితారాధారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయా గ్రామాల్లో నిర్వహించిన వారి దశదిన కర్మల్లో పాల్గొని మృతుల చిత్రపటాలకు నివాళులర్పించారు. పలువురు నాయకులు ఉన్నారు.

బేతవోలు జనసంద్రం



బేతవోలులో జాతర సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాన్ని తిలకిస్తున్న ప్రజలు

- కనుల పండువగా కనకదుర్గమ్మ జాతర
- రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ప్రభబండ్ల ర్యాలీలు, కోలాట ప్రదర్శనలు
- తరలివచ్చిన ప్రముఖులు, ప్రజలు

చిలుకూరు : మండలంలోని బేతవోలులో శుక్రవారం కనకదుర్గమ్మ జాతర వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు అమ్మవారికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఊరంతా వన భోజనాలకు వెళ్లారు. రైతులు ప్రభబండ్లను అలంకరించి ఆలయం వద్దకు తీసుకొచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి అక్కడే వదిలివెళ్లారు. శనివారం ప్రభబండ్లను ఇంటికి తీసుకెళ్లడం ఇక్కడి ఆచారం. జాతర సందర్భంగా బేతవోలుతో పాటు చుట్టుపక్కల గ్రామాల వారు వేలాదిగా తరలివచ్చి కనకదుర్గ దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పోటాపోటీగా ర్యాలీలు, కోలాట ప్రదర్శనలు

జాతర సందర్భంగా సీపీఐ వారు ఏర్పాటు చేసిన కోలాట ప్రదర్శనను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. కాంగ్రెస్ కోలాట ప్రదర్శనను ఆ పార్టీ నాయకుడు పందిరి నాగిరెడ్డి ప్రారంభించారు. అదేవిధంగా సీపీఎం నాయకులు ఏర్పాటు చేసిన కోటాల ప్రదర్శనను ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి ప్రారంభించారు. కాగా కోలాట పోటీలకు ముందు ఆయా పార్టీల ఆధ్వర్యంలో వరుసగా గ్రామంలో పెద్దఎత్తున ర్యాలీలు నిర్వహించారు.

బీఆర్‌ఎస్‌లో రెండు వర్గాలుగా..

బీఆర్‌ఎస్ నాయకులు రథశాల సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన కోలాట ప్రదర్శనను కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ ప్రారంభించారు. అలాగే బీఆర్‌ఎస్‌లోని రెండో వర్గం వారు పోలేనిగూడెం రోడ్డులో ఏర్పాటు చేసిన కోలాట ప్రదర్శనను మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, బీఆర్‌ఎస్ కోదాడ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ కె.శశిధర్‌రెడ్డి, ఎంపీపీ ప్రశాంతికోటయ్య, జెడ్పీటీసీ బొలిశెట్టి శిరీషానాగేంద్రబాబు, సర్పంచ్ వట్టికూటి చంద్రకళ నాగయ్య, ఎంపీటీసీలు నెమ్మాది సైదాబాబు, వట్టికూటి ధనమూర్తిలు ప్రారంభించారు. ఈ పోటీలు పోటాపోటీగా సాగాయి. గ్రామంలో ఏ పార్టీ వారు ఆ పార్టీ వారు నిర్వహిస్తున్న కోలాట ప్రదర్శన వద్దనే ఉన్నారు. కోలాట ప్రదర్శన వద్ద ప్రజలు కిక్కిరిసిపోయారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కోదాడ రూరల్ సీఐ నాగదుర్గాప్రసాద్, ఎస్ఐ చల్లా శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీఓ ఈదయ్య, రెవెన్యూ అధికారులు జాతరను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ సర్పంచ్ తాళ్లూరి శ్రీను, సొసైటీ చైర్మన్ బాషం సైదులు, వైస్ చైర్మన్ అక్కినపల్లి జానకీరామాచారి, ఉప సర్పంచ్ అంతయ్య, రెమిడాల ఆనందరావు, పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్ ర్యాలీలో ప్రత్యేక వాహనంపై కూర్చుని వెళ్తున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



కనకదుర్గమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



బీఆర్‌ఎస్ ర్యాలీని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు, శశిధర్‌రెడ్డి



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ఎద్దుల పందేలు ప్రారంభం



ఎద్దుల పందేలను ప్రారంభిస్తున్న శశిధర్‌రెడ్డి, ఎంపీపీ, జెడ్పీటీసీ, ప్రజాప్రతినిధులు

చిలుకూరు : మండలంలోని బేతవోలు గ్రామంలో కనకదుర్గమ్మ జాతర సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి ఎద్దుల పందేలను శుక్రవారం ఆ పార్టీ కోదాడ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి కన్మతరెడ్డి శశిధర్‌రెడ్డి, స్థానిక ఎంపీపీ బండ్ల ప్రశాంతి కోటయ్య, జెడ్పీటీసీ బొలిశెట్టి శిరీష నాగేంద్ర బాబు, సర్పంచ్ వట్టికూటి చంద్రకళనాగయ్య ప్రారంభించారు. ముందుగా కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండు రోజుల పాటు ఎద్దుల పందేలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నడిగూడెం జెడ్పీటీసీ కొణతం ఉమా శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ వట్టికూటి ధనమూర్తి, నెమ్మాది సైదాబాబు, బీఆర్‌ఎస్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ హాల్‌లోకి కోర్టు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ప్రస్తుతం పనిచేస్తున్న భవనం నుంచి బార్ అసోసియేషన్ పాత హాలులోకి శుక్రవారం మార్చారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాంకుమార్, జూనియర్ సివిల్ జడ్జి సాకేత్ మిత్రలు రిబ్బన్ కట్ చేసి దానిని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. హైకోర్టు ఆదేశాల మేరకు జూనియర్ సివిల్ జడ్జి కోర్టును వేరే భవనంలోకి మార్చినట్లు తెలిపారు. హుజూర్‌నగర్‌కు జిల్లా కోర్టు మంజూరు అయినందున దాని కోసం ప్రస్తుత జూనియర్ సివిల్ జడ్జి హాలును కేటాయించి, పాత బార్ అసోసియేషన్ హాలులోకి జూనియర్ సివిల్ జడ్జి కోర్టును మార్చామన్నారు. ఇక నుంచి ఇక్కడే అన్ని కార్యకలాపాలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రామిరెడ్డి, న్యాయవాదులు అంబటి శ్రీనివాసరెడ్డి, కాల్వ శ్రీనివాసరావు, ఏజీపీ వీజీకేమూర్తి, పలువురు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కోర్టు హాలును ప్రారంభిస్తున్న జడ్జీలు శ్యాంకుమార్, సాకేత్ మిత్ర

హైవే దిగ్బంధాన్ని జయప్రదం చేయాలి



కోదాడఅర్బన్ : పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు

కోదాడఅర్బన్ : బీజేపీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చినా నేటికీ చట్టబద్ధత కల్పించకుండా మాదిగలను మోసం చేసిందని ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్ర భిక్షపతి, ఎంఎస్పీ రాష్ట్ర నాయకుడు ఏపూరి వెంకటేశ్వరరావు అన్నారు. ఈ నెల 13న హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారి దిగ్బంధాన్ని విజయవంతం చేయాలని శుక్రవారం కోదాడలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఎంఎస్పీ పట్టణ కన్వీనర్ ఏపూరి రాజుమాదిగ ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించారు. బీజేపీ ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ నెల 13న నిర్వహించే కార్యక్రమంలో మాదిగలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

13న రహదారుల దిగ్బంధం

నడిగూడెం : ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 13న చేపట్టబోయే హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారి దిగ్బంధాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు కొండపల్లి ఆంజనేయులు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట రహదారి దిగ్బంధానికి సంబంధించిన వాల్ పోస్టర్లను ఆ యన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ మండల ఇన్‌చార్జ్ మిట్టగణుపుల మోష, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు దున్నా అభిమన్యు, ఎంఎస్ఎఫ్ నాయకులు నవీన్, గోపి, మధు, కిరణ్, అజయ్, శ్రీహర్ష, పాల్గొన్నారు.



నడిగూడెంలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

రాజు మృతి బాధాకరం

కోదాడరూరల్ : యర్రవరం ఎంపీటీసీ, బీక్యాతండా గ్రామానికి చెందిన గుగులోతు రాజు మృతి బాధాకరమని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, కూచిపూడి ఎంపీటీసీ శంకరశెట్టి కోటేశ్వరరావు అన్నారు. శుక్రవారం తండాలో నిర్వహించిన రాజు దశదిన కర్మలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. సర్పంచ్ బాణోతు అంబేద్కర్, కోఆప్షన్ సభ్యుడు షేక్.ఉద్దండు, పీఏసీఎస్ డైరెక్టర్ రవి, అన్నెం పెద్ద అంజిరెడ్డి, రావుల వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

శానిటేషన్ రిపోర్ట్ యాప్‌లో నమోదు చేయాలి



నర్సరీలో మొక్కలకు నీరు పోస్తున్న డీఎస్‌పీఓ శ్రీరాములు

హుజూర్‌నగర్‌రూరల్ : అధికారులు ప్రతీరోజు ఉదయం 7 గంటలకు విధులకు హాజరై శానిటేషన్ పనులను విస్తృతంగా చేపట్టి శానిటేషన్ రిపోర్ట్‌ను మొబైల్ యాప్‌లో నమోదు చేయాలని డీఎస్‌పీఓ శ్రీరాములు సూచించారు. శుక్రవారం డ్రైడే సందర్భంగా వేపలసింగారంలో సర్పంచ్ అన్నెం శిరిషాకొండారెడ్డితో కలిసి నర్సరీలో మొక్కలను పరిశీలించి నీరు పోశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతిరోజు ట్రాక్టర్ ద్వారా చెత్తను సేకరించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. హరితహారంలో నాటిన మొక్కలు 100 శాతం బతికేలా చూడాలని, నూరు శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని ఆదేశించారు. అనంతరం అంజలీపురంలో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శాతంకుమారి, ఎంపీఓ మౌలానా, ఏపీఓ శైలజ, కార్యదర్శులు నాగమణి, నరేష్, సేనిత, శేఖర్, సైదులు, వైద్య సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

15న సేవాలాల్ జయంతి ఘనంగా నిర్వహించాలి

హుజూర్‌నగర్ : గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ శ్రీసేవాలాల్ జయంతిని ఈనెల 15న ఘనంగా నిర్వహించాలని బంజారా నాయకులు కోరారు. శుక్రవారం స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో సేవాలాల్ జయంతి నిర్వాహణపై వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవాలాల్ ఆశయాలను సాధించి బంజారాలు అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు వెంకట్‌రామ్, బాలాజీ, లచ్చిరాం, రవీందర్, లక్ష్మా, నాగు, గాంధీ, రామ్మూర్తి, రాజు తదితరులు పాల్గొన్నారు .

పరామర్శ

నడిగూడెం : మండలంలోని కాగితరామచంద్రాపురానికి చెందిన షేక్.అబ్దుల్ ఘనీ, పఠాన్ షరీఫ్ మునగాల మండలం ముకుందాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో శుక్రవారం మృతుల కుటుంబాలను మాజీ జిల్లా కోఆప్షన్ సభ్యుడు అల్తాఫ్ హుస్సేన్ పరామర్శించారు. ఆయన వెంట మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ.జలీల్, రిటైర్డు ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు ఎండీ.ఖలీల్ అహ్మద్, ఉన్నారు.

వైభవంగా కనకదుర్గమ్మ జాతర



ఆలయం వద్దకు ప్రదర్శనగా వెళ్తున్న ప్రభబండ్లు



ఊరేగింపులో పాల్గొన్న సర్పంచ్, గ్రామ పెద్దలు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని కరక్కాయలగూడెం గ్రామంలో కనకదుర్గమ్మ జాతర (బండ్ల పండుగ)ను శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు ప్రభ బండ్లను రంగ రంగుల రిబ్బన్లు, తోరణాలతో అలంకరించి ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. తదనంతరం ఊరంతా వన భోజనాలకు వెళ్లారు. గ్రామంలో వివిధ పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించిన కోలాట ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కాగా శనివారం రైతులు ఆలయం వద్ద నుంచి ప్రభ బండ్లను ఇంటికి తీసుకెళ్తారు. కార్యక్రమంలో సర్పంచ్ కీత జయమ్మధనమూర్తి, ఎంపీటీసీ మచ్చ వెంకటేశ్వర్లు, డీసీఎంఎస్ డైరెక్టర్ దొంగరి వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ చింతకుంట్ల కల్పన, మాజీ సర్పంచ్ దొంగరి అరుణ సత్యనారాయణ, మాధవరావు, సత్యనారాయణ, వీరయ్య, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

దేశ అభివృద్ధి కోసమే బీఆర్‌ఎస్

- ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

కోదాడ : తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన కేసీఆర్.. దేశాన్ని అభివృద్ధి చేయడానికే బీఆర్‌ఎస్ పార్టీని స్థాపించాడని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శుక్రవారం ఆయన కోదాడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ దేశంలో ఎక్కడ సభ పెట్టినా విజయవంతం అవుతోందని, ఆయనకు అన్ని రాష్ట్రాల ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. అన్ని కులాలకు గౌరవమిస్తూ హైదరాబాద్‌లో అన్ని కులాల వారికి ఆత్మగౌరవ భవనాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ ఆధ్వర్యంలో నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. అంతకుముందు ఆయన కోదాడలోని లింగమంతుల స్వామి దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

క్రీడలతో ప్రపంచ స్థాయి కీర్తి ప్రతిష్టలు

- డీఎస్పీ వెంకటేశ్వరరెడ్డి

అనంతగిరి : క్రీడల ద్వారా ప్రపంచ స్థాయి కీర్తి ప్రతిష్టలు లభిస్తాయని కోదాడ డీఎస్పీ వెంకటేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక అనురాగ్ ఇంజనీరింగ్ కాలేజ్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలతో ఈ ప్రాంత విశిష్టతను దశదిశలా వ్యాపింపజేయవచ్చని అన్నారు. విద్యార్థులు చదవుతో పాటు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. కళాశాల కరస్పాండెంట్, ఎమ్మెల్సీ డాక్టర్ పల్లా రాజేశ్వరరెడ్డి విజేతలకు ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ శివప్రసాద్, డిప్లమా ఇన్‌చార్జ్ గణపతి, తిరుమలగిరి, మధిర, సాగర్ ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాల్స్ రవీందర్, రాజ్‌కుమార్, అయిలయ్య, కాలేజీ పీడీలు ధర్మభిక్షం, కనకయ్య నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న డీఎస్పీ వెంకటేశ్వరరెడ్డి

బీజేపీతోనే అన్ని వర్గాలకు న్యాయం

కోదాడరూరల్ : బీజేపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పోరెడ్డి కిషోర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నల్లబండగూడెంలో జరిగిన ప్రజాగోస- బీజేపీ భరోసా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలను పరిష్కరించడంలో బీఆర్‌ఎస్ పార్టీ పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఈ సందర్భంగా బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ పుల్లారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కనగాల నారాయణ, అక్కిరాజు యశ్వంత్, బొలిశెట్టి కృష్ణయ్య, చలిగంటి ప్రమీల, కనగాల వెంకట్రామయ్య, నూనె సులోచన, యాదా రమేష్, హనుమంతరావు, యరగాని రాధాకృష్ణ ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పోరెడ్డి కిషోర్‌రెడ్డి

మెరిట్ విద్యార్థులకు గోల్డ్ మెడల్స్



బంగారు పతకాలు అందుకున్న విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, బంగారు పతకాల కమిటీ సభ్యులు

కోదాడఅర్బన్ : కోదాడలోని కేఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2020- 22 విద్యా సంవత్సరంలో ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన ఏడుగురు విద్యార్థులకు శుక్రవారం అమృత రామానుజరావు ట్రస్ట్ ఆధ్వర్యంలో గోల్డ్ మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొండపల్లి శేషప్రసాద్ మాట్లాడారు. ప్రతిభ కలిగిన పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు ప్రోత్సాహం అందించడమే ట్రస్ట్ లక్ష్యమన్నారు. అనంతరం ట్రస్ట్ కార్యదర్శి మంత్రిప్రగఢ శ్రీధర్‌రావు మాట్లాడుతూ 2012లో ప్రారంభించిన అమృత రామానుజరావు ట్రస్ట్ ఆధ్వర్యంలో.. ప్రభుత్వ సంస్థలలో చదివి ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ ఇస్తున్నామని చెప్పారు. ఈ సంవత్సరం కేఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు జె.సాయితేజ, ఆర్.లహరి, బి.శ్రీకాంత్, బి.ఆంజనేయులు, కె.మానస, పి.నాగేశ్వరరావు, కె.వెంకటరమణలకు గోల్డ్ మెడల్స్ ఇచ్చామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రేపాల శ్రీనివాస్, ట్రస్ట్ కోశాధికారి కొండపల్లి వెంకట శారదాప్రసాద్, సభ్యులు యశ్వంత్‌కుమార్, అధ్యాపకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

ఉన్నత స్థానాల్లో నిలిచిన సీనియర్ విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదగాలని బంగారు పతకాల కమిటీ సభ్యుడు, కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ఎ.శంకర్ అన్నారు. పట్టణ పరిధిలోని కేఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో 2021- 22 విద్యా సంవత్సరంలో డిగ్రీలో వివిధ సబ్జెక్ట్‌ల్లో మొదటి స్థానం సాధించిన 18 మంది విద్యార్థులకు బంగారు పతకాల కమిటీ తరఫున ఆ కమిటీ సభ్యుడు సీహెచ్.అనంతరామిరెడ్డితో కలిసి బంగారు పతకాలను శుక్రవారం కళాశాలలో బహూకరించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ఎం.నాగు మాట్లాడుతూ ఇలాంటి పతకాల బహూకరించడంతో విద్యార్థుల్లో నూతన ఉత్సాహం, విద్యలో పోటీతత్వం ఏర్పడుతుందని అన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బంగారు పతకాలు అందుకున్న విద్యార్థులతో అమృత రామానుజరావు ట్రస్ట్ సభ్యులు

బాధిత కుటుంబాలకు పరామర్శ

గరిడేపల్లి : మండలంలోని కోనాయిగూడెం గ్రామంలో మాజీ ఎంపీటీసీ సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తల్లి సారెడ్డి లక్ష్మీనర్సమ్మ ఇటీవల మృతి చెందారు. కోదాడ మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు నలమాద పద్మావతిరెడ్డి శుక్రవారం ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

మాజీ సర్పంచ్ ఖరీంకు నివాళి

కోదాడరూరల్ : మండల పరిధిలోని కూచిపూడి మాజీ సర్పంచ్ షేక్.ఖరీం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం గ్రామంలో నిర్వహించిన ఆయన దశదిన కర్మలో మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆమె గ్రామంలో పర్యటించి రైతుల సమస్యలు తెలుసుకున్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి, రేవూరి వెంకటాచారి, సుందర్‌రావు, నాయకులు ఉన్నారు.



కోదాడరూరల్ : ఖరీం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

పవన్ కుటుంబసభ్యులకు పరామర్శ

అనంతగిరి : మండలంలోని త్రిపురవరంలో గుండెపోటుతో మరణించిన మహంకాళి పవన్‌కుమార్ కుటుంబసభ్యులను మాజీ ఎమ్మెల్యే ప ద్మావతి శుక్రవారం పరామర్శించారు. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకుంట్ల లక్ష్మీనా రాయణరెడ్డి, మాజీ ఎంపీపీ రామారావు, నా యకులు వెంకటేశ్వర్లు, వెంకటరెడ్డి ఉన్నారు.

టర్కీ, సిరియా మృతులకు నివాళి



టర్కీ, సిరియా దేశాల్లో సంభవించిన భూకంపంలో మృతిచెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని, క్షతగాత్రులకు ఓదార్పునివ్వాలని కోరుతూ శుక్రవారం కోదాడలోని నయానగర్ బాపిస్ట్ చర్చిలో తెలంగాణ యూనైటెడ్ క్రిస్టియన్ సాంగ్ పాస్టర్ డాక్టర్ వి.యేసయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు. – కోదాడ అర్బన్